TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

తెలుగు దినపత్రిక

ADAAB CYBERABAD DAILY NEWS PAPER

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

PUBLISHED FROM : HYDERABAD-MEDCHEL MALKAJGIRI-RANGAREDDY

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ సంపుటి : 1 సంచిక : 85 శుక్రవారం, అక్టోబర్ 09, 2026 , పేజీలు - 4 వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR VOLUME : 1 ISSUE: 85 09-10-2026 (FRIDAY) PAGES: 4 RS : 5/-

హైదరాబాద్‌లో ఇండీ కూటమి

‘చలో లోక్‌భవన్’ ఉద్రిక్తం

- మంత్రులను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ :హైదరాబాద్‌లో ‘సేవ్ డెమోక్రసీ’ పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, వామపక్ష పార్టీ నేతలు ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు.దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ‘సేవ్ డెమోక్రసీ’ పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ‘చలో లోక్‌భవన్’ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.ఇండీ కూటమి ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకునే సరికి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో పోలీసులకు, ఇండీ కూటమి నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి లోక్ భవన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మంత్రులను అదుపులోకి తీసుకుని డీసీఎంలోకి ఎక్కించి పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు.

వచ్చేది మరో ఎండాకాలమే!

- రాష్ట్రంలో రానున్న రోజుల వాతావరణంపై ఐఎండీ అలర్ట్



హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్‌వాతావరణకేంద్రంప్రకటించింది. దీంతో ఉక్కపోత వాతావరణం నెలకొని జనం అసౌకర్యానికి గురవుతున్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఈ విధంగానే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాలనిష్క్రమణప్రారంభమైందన్నారు. ఉత్తర, మధ్య తెలంగాణ నుంచి నిష్క్రమించిన నైరుతి రుతుపవనాలు, రేపటికల్లాపూర్తిస్థాయిలోతిరోగమనమవుతాయని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోఉండబోయేవాతావరణపరిస్థితులను తెలుసుకోవడానికి ఈనాడు–ఈటీవీ భారత్ ఐఎండీఅధికారిశ్రీనివాస్‌రావుతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించింది.

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను

టార్గెట్ చేస్తున్నారు

హైదరాబాద్ :తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. “బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి” అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్య బద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జూరాల కాలువకు నీరొదిలిన

రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్

హైదరాబాద్ :జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి.

ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో.. ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని సూచించారు. (గురువారం) సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న రేవంత్.. బీజేపీ తీరును తీవ్రంగా విమర్శించారు. ‘మొదట మతాన్ని, భాషను ఉపయోగించుకుని ప్రధాని మోదీ నెగ్గేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఈ ప్రయోగాలు చెల్లవని 13 కోట్ల ఓట్లు తొలగించి మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్నారు’ అని ఆయన మండిపడ్డారు. బ్రిటీషర్స్ సైమన్ కమిషన్ వాడితే, బీజేపీ ఎన్నికల కమిషన్ వాడుతోందని ఆరోపించారు. నాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే నేడు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారి ఓట్లను కాపాడటమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఓట్ల తొలగింపు కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్య అని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, ‘సర్’ ప్రక్రియను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పంతాలకు పోకుండా వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో ఏం జరిగిందో ప్రధాని మోదీ విషయంలో కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ ఓట్ల తొలగింపు ద్వారా రెండు రకాల పౌరులు ఏర్పడుతున్నారని

రేవంత్ వివరించారు. ఓటు ఉన్నవారు ఓటు లేని వారిని ద్వితీయ పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

రైతులకు బేడీలా?

కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ ఖాతా వేదికగా స్పందించారు. “కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది” అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు.“ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?” అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ పాలనలో

డిజిటల్ విప్లవం.

■ ఇకపై జీవోలు, అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారానే

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వ శాఖల పూర్తిస్థాయి డిజిటలైజేషన్, ప్రభుత్వ ఉద్యోగుల ఎలక్ట్రానిక్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రజలకు, ఉద్యోగులకు ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడమే లక్ష్యంగా పరిపాలనా వ్యవస్థలో పలు విప్లవాత్మక డిజిటల్ మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పలు కీలక నిర్ణయాలు, మార్గదర్శకాలను వెలువరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరి వివరాలను ఈనెల 15వ తేదీ నాటికి తప్పని సరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని సీఎస్ స్పష్టమైన గడువు విధించారు.ప్రతి ఉద్యోగి సర్వీస్ వివరాలు, పదోన్నతులు, లీవ్స్, పే స్కేల్స్ తదితర సేవా రికార్డులన్నీ ఇకపై ఆన్‌లైన్ వేదికగానే పూర్తి పారదర్శకంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అనుమతులు, అధికారిక ఉత్తర్వులు అన్నింటినీ ఇకపై కేవలం డిజిటల్ విధానంలోనే జారీ చేయాలని నిర్ణయించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని రకాల మంజూరులు , నిధుల చెల్లింపులు నూరు శాతం ఆన్‌లైన్ పద్ధతిలోనే జరగాల్సి ఉంటుంది.వివిధ అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతులను కూడా ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

నాపై పోటీ చేసి గెలువు

కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్

హైదరాబాద్ :ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన ‘సేవ్ డెమోక్రసీ’ ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ‘దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్’ అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించా రు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది.

శుక్రవారం,
అక్టోబర్ 09, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

అక్రమ షెడ్లపై చర్యలు తప్పవు.

నిబంధనలు పాటించని నిర్మాణాల తొలగింపు.
పరిగి మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి.అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లపై అధికారులు కొరడా ఝుళిపించను న్నారుగురువారం అధికారులు ఫీల్డ్ విజిట్ నిర్వహించి షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకరు మాత్రమే షెడ్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నట్లు, మిగతా వారు ఎలాంటి అనుమతులు పొందలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణాలు చేపట్టిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లను కూల్చివేస్తామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు తెలిపారు.

మోత్కూర్ లోఎంపీ నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం

మోత్కూరు గ్రామం 5వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి.దోమ మండలంలోని మోత్కూరు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని 5వ వార్డులో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ప్రారంభించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణం పూర్తికావడంతో స్థానికంగా రాకపోకలకు సౌకర్యం కలగనుంది. ఇప్పటివరకు రహదారి సదుపాయం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వార్డు ప్రజలకు సీసీ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఉపశమనం కలిగింది. గ్రామంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై వారు వివరాలు చర్చించారు. గ్రామంలో మిగిలిన మౌలిక వసతుల అభివృద్ధికి కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

వరల్డ్ సైట్ డే సందర్భంగా కంటి ఆరోగ్యంపై అవగాహన

అదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : వరల్డ్ సైట్ డే సందర్భంగా జవహర్‌నగర్‌లో మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో 'I Pledge to Protect My Visionµ' ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ప్రతి ఒక్కరికీ కంటి వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అక్టోబర్ 31 వరకు ఉచిత కంటి వైద్య సంప్రదింపులు అందిస్తున్నట్లు మ్యాక్సీవిజన్ ప్రతినిధులు తెలిపారు.

టీయూడబ్ల్యూజే దోమ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా జి. రాము ముదిరాజ్.
ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌రావు.

ఆదాబ్ హైదరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా దోమ మండల టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.దోమ మండల అధ్యక్షుడిగా జి. రాము ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా వడ్ల సురేందర్, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గౌర్వర్ రాఘవేందర్‌రావు, కార్యదర్శులుగా జి. విజయ్‌కుమార్, వినోద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొల్ల కృష్ణ, కోశాధికారిగా కోరే బిచ్చిలింగం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రమేష్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, దస్తగిరి ఎంపికయ్యారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం పరిగి నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకుడు బాబయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు జి. రాము ముదిరాజ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని పేర్కొన్నారు.మండలంలోని జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని రాము ముదిరాజ్ తెలిపారు. జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యలతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.నూతన కమిటీకి పరిగి నియోజకవర్గ, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సురేష్, రఘు, అనంతయ్యతో పాటు మండల కమిటీ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం అమావాస్యకు రెండు రోజుల ముందే బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కూకట్‌పల్లి గ్రామంలోని పలు ప్రాంతాలతో పాటు కూకట్‌పల్లి హనుమాన్ దేవాలయం వద్ద ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.
మహిళలు, ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం బతుకమ్మలను పీఎన్ఎం స్కూల్ గ్రౌండ్‌కు తీసుకువచ్చి అక్కడ కూడా బతుకమ్మలు ఆడిన తర్వాత రంగదాముని చెరువులో నిమజ్జనం చేయనున్నారు.బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా రంగదాముని చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రతి ఆడపడుచుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పోలీసు శాఖల అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్

నియంత్రణ, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు.
ఈ నెల 18న పెద్ద బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు, ఆడపడుచులు పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కొనసాగుతున్న ఈ ప్రత్యేక సంప్రదాయాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ

సభ్యులు అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'చలో లోక్‌భవన్'

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: పట్వారీ శశిధర్

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు పరిరక్షణ కోసం నెక్లెస్ రోడ్ వద్ద నిర్వహించిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్వారీ శశిధర్ పాల్గొని నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని అన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్

ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను నిరసిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని, వారి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని శశిధర్ స్పష్టం చేశారు. ఓటు హక్కు రక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ అని, ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. రాజ్యాంగ విలువలను, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.
'ఓటు హక్కు రక్షణే ప్రజాస్వామ్య రక్షణ.. ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది' అనే నినాదాలతో నాయకులు, కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, యువకులు, కార్యకర్తలతో పాటు టీం పట్వారీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దోమ మండల దివ్యాంగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా కుర్వ ఆంజనేయులు ఏకగ్రీవ ఎంపిక.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో దోమ మండల దివ్యాంగుల సంఘం నూతన కమిటీని గురువారం రైతు వేదికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కుర్వ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా తెలుగు వెంకటయ్య, కార్యదర్శిగా దుద్యాల మల్లేష్, సహాయ కార్యదర్శిగా తర్య నాయక్, కోశాధికారిగా కాజా పాషా, మీడియా కన్వీనర్‌గా బొంగు బాలరాజును ఎంపిక చేశారు.నూతన కమిటీ సభ్యులకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ నియామక పత్రాలను

అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.నూతన అధ్యక్షుడు కుర్వ ఆంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేల వరకు పెంచడం, అర్హులైన ప్రతి దివ్యాంగ కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడం, నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయడం, 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్ష పదవిని అప్పగించిన దోమ మండల దివ్యాంగులు, జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్‌తో పాటు కమిటీ సభ్యులకు కుర్వ ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చుక్కయ్య, జిల్లా సలహాదారు వెంకటేష్, మీడియా కన్వీనర్ నర్సిములు, సభ్యులు వెంకటేష్, నరేష్, మొగలయ్య, యాదయ్య, వరేశం తదితరులు పాల్గొన్నారు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో లోక్ భవన్

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: ఓట్ల సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్ పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'చలో లోక్ భవన్' కార్యక్రమం నిర్వహించారు. ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు.నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం నినాదాలు చేస్తూ ర్యాలీగా లోక్ భవన్ వైపు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు దారితీస్తున్నాయని ఆరోపించారు.
ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని బండి రమేష్ అన్నారు. ఓటు హక్కుకు భంగం కలిగించే ఎలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో పాటు యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని బండి రమేష్ పిలుపునిచ్చారు. ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పోరాటాలను కొనసాగించాలని ఆయన అన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు ఫారం-18 సమర్పణ

అదాబ్ సైబరాబాద్, కాప్రా : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాప్రా మున్సిపల్ కార్యాలయంలో ఫారం-18 దరఖాస్తులను సమర్పించారు. మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ సాగర్, ఎంఆర్వో మతిన్‌కు దరఖాస్తులు అందజేశారు.డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తైన అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం-18తో పాటు డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఫొటో జతచేయాలని తెలిపారు. అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

ఆదాబ్ సైబరాబాద్,యాచారం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమావేశం అనంతరం ఉచిత బస్సులో ప్రయాణిస్తూ మహిళల స్పందన తెలుసుకునే క్రమంలో ఓ యువతితో ఆప్యాయంగా మాట్లాడిన ఘటనను కొందరు వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.రాజకీయ విమర్శలు ఉంటే అభివృద్ధి అంశాలపై హుందాగా ప్రశ్నించాలని, మహిళల గౌరవానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి ప్రచారాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు.

అభివృద్ధి పథంలో చంద్రపురి కాలనీ

130 మీటర్ల డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్ : చంద్రపురి కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. పాతబస్తీలో 130 మీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రతి గల్లీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానంద్, మాజీ కార్పొరేటర్ నవీన్‌కుమార్, సతీష్‌గౌడ్, మాట్ల శ్రీనివాస్, రజిత గోపాల్, లత, సునీత, మేరీ, చిట్టిబాబు, నంగునూరు అశోక్‌గుప్తా, బూడిద వెంకటేష్, సాయికృష్ణ, రాహుల్,అజయ్‌కుమార్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ద

తండాలో తీరనున్న డ్రైనేజీ, తాగునీటి కష్టాలు

ఆదాబ్ సైబరాబాద్,యాచారం : మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని బొల్లిగుట్ట తండా అభివృద్ధికి మరో అడుగు పడింది. దశాబ్దాలుగా తండా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామ పంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది.రూ. 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్, స్థానిక వార్డు సభ్యులు గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బొల్లిగుట్ట తండా అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో తండాలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడ్డారని, అలాగే తాగునీటి పైప్ లైన్ పాతబడి లీకేజీలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇప్పుడు నూతనంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడంతో పాటు, కొత్త వాటర్ పైప్ లైన్ వేయడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.గ్రామంలోని ప్రతి తండా, ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని, నిధుల కొరత లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి.

పరిగి పట్టణంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో పూడూర్ గ్రామానికి చెందిన గొర్రెంక సత్యనారాయణ కుమారుడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి, వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాకతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్ పోరుబాట

రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా చింతపల్లిలో భారీ ధర్నా
ఎస్ఐఆర్‌పై అనుమానాలకు ఎన్నికల సంఘమే సమాధానం చెప్పాలి
సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే బాలు నాయక్

ఆదాబ్ సైబరాబాద్, చింతపల్లి: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తాము లేవనెత్తుతున్న సందేహాలకు ఎన్నికల సంఘం పారదర్శకంగా సమాధానం చెప్పాలని కోరారు.

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసనకు వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనకు నిరసనగా గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో ఎమ్మెల్యే బాలు నాయక్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఓటు ప్రజల హక్కు

ప్రతి అర్హుడైన పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎవరూ హరించలేరని బాలు నాయక్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారనే కాంగ్రెస్ ఆరోపణలపై ఎన్నికల సంఘం పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు,

చేర్పులు, తొలగింపుల విషయంలో ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని, అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు.

"ప్రజల ఓటు హక్కుతో చెలగాటం ఆడితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ప్రజాస్వామ్యంలో ఓటు సామాన్యుడి చేతిలో ఉన్న శక్తివంతమైన హక్కు. దాన్ని కాపాడేందుకు ప్రజల పక్షాన పోరాడుతాం" అని బాలు నాయక్ అన్నారు.

ఎస్ఐఆర్‌పై స్పష్టత ఇవ్వాలి

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, ఓటర్ల జాబితాపై తలెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే కోరారు. రాజ్యాంగబద్ధమైన సంస్థగా ఎన్నికల సంఘం ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా తన కార్యకలాపాల్లో పారదర్శకత పాటించాలని అన్నారు. ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

అరెస్టులతో ఉద్యమం ఆగదు

ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరికాదని బాలు నాయక్ అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ప్రజల తరపున రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

సీఈసీ రాజీనామాకు డిమాండ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు,ఎస్ఐఆర్ ప్రక్రియపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో ఆయన నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని బాలు నాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి

ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితా ప్రక్రియ ప్రభావితమవుతోందనే అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని అన్నారు.

"ఓటు హక్కుపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. ప్రజల ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది. ఓటు హక్కు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు" అని బాలు నాయక్ అన్నారు.ధర్నాలో చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువ నాయకులు, పార్టీ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

ఇబ్రహీంపట్నం సీడీపీవో వినీతాదేవి

ఆదాబ్ సైబరాబాద్,ఇబ్రహీంపట్నం : ప్రతి ఒక్కరూ పోషకాహార వైవిధ్యాన్ని పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచన మేరకు ఇబ్రహీంపట్నం ప్రాజెక్ట్ స్థాయిలో సీడీపీవో వినీతాదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వినీతాదేవి మాట్లాడుతూ పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. పూర్వ ప్రాథమిక విద్య, పీఎంఎంవీవై పథకం, ఆరోగ్యం, చిన్నారుల ఇమ్యునైజేషన్ టీకాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ సంప్రదాయ, పోషక విలువలున్న వంటకాలను ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి, తక్కువ బరువుతో పుట్టిన శిశువుల సంరక్షణపై సూచనలు చేశారు. అంగన్‌వాడీ

కార్యకర్తలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.అనంతరం కార్యక్రమం ముగింపులో అందరితో కలిసి "పోషణ ప్రతిజ్ఞ" చేయించారు.కార్యక్రమంలో వైద్య ఆరోగ్య

శాఖకు చెందిన డాక్టర్ ప్రత్యూష, మెప్మా ప్రియాంక, ఎమ్మార్వో కార్యాలయ ఆర్ఐ మాధవి, ఏపీఎం సాంబశివుడు,మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిలో డ్వాక్రా భవన నిర్మాణం..!

అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారని రైతుల ఆరోపణ..!
కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన.

ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా: తమకు కేటాయించిన అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా డ్వాక్రా భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నవాబుపేట్ మండల పరిధిలోని సర్వే నంబర్ 297లో ఉన్న 30 గుంటల భూమి విషయంలో గ్రామ సర్పంచ్ అరుణ బంధయ్య గౌడ్, ఆమె భర్త బంధయ్య గౌడ్ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భవన నిర్మాణ పనులు ప్రారంభించారని రైతు కరణం బ్రహ్మయ్య ఆరోపించారు. గురువారం విలేకరులతో రైతు కరణం బ్రహ్మయ్య మాట్లాడుతూ.. సర్వే నంబర్ 297లోని భూమిలో తాము గత ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ జీవనాధారమైన భూమిలో తమకు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా డ్వాక్రా భవన నిర్మాణ పనులు ప్రారంభించడం తమకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా..!

భవన నిర్మాణ పనులు.ప్రారంభమైన విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని రైతులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అదేవిధంగా తహసీల్దార్ (ఎమ్మార్వో)కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్యపై అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమికి సంబంధించిన రికార్డులు, హక్కులు, భూమి స్వరూపాన్ని అధికారులు పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని కోరారు.

దౌర్జన్యంగా నిర్మాణం చేపట్టడం సరికాదు.

రైతులకు సమాచారం ఇవ్వకుండా వారి ఆధీనంలో ఉన్న భూమిలో నిర్మాణ పనులు చేపట్టడం సరికాదని కరణం బ్రహ్మయ్య,రైతులు శ్రీనివాస్, ప్రకాశం అన్నారు.తమకు న్యాయం జరిగే వరకు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తే చట్టపరంగా పోరాటం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. తమ జీవనాధారమైన భూమి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని రైతులు కోరారు. సర్వే నంబర్ 297లోని 30 గుంటల భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, అసైన్డ్ భూమి వివరాలు, నిర్మాణానికి తీసుకున్న అనుమతులు తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

తమ భూమి విషయంలో ఏర్పడిన వివాదాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇరువర్గాల వాదనలు విని న్యాయబద్ధంగా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్మాణ పనులు చేపట్టడం వల్ల భవిష్యత్తులో మరింత వివాదం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 297 భూమిని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి హక్కులు తదితర అంశాలపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కరణం బ్రహ్మయ్య, శ్రీనివాస్, ప్రకాశం కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే తమ హక్కుల కోసం చట్టపరమైన మార్గంలో పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు.

ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా పనిచేయాలి

పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సూచించారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో ఆయన పాల్గొని మండల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలు, పనుల ప్రస్తుత పరిస్థితిపై అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు పరస్పర

సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో వేగం పెంచాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

స్థానిక సంస్థల బలోపేతానికి రాష్ట్ర ఆర్థిక సంఘం సంప్రదింపుల సమావేశం

సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో సమగ్ర ప్రతిపాదనపై చర్చ

ఆదాబ్ సైబరాబాద్, డెస్క్: తెలంగాణలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన అధ్యయనాలు, విధానాలపై తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో ఉన్నతస్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం సభ్యులు కాకి రంగరాజ్, ఆసిఫ్ అలీ, సుధీర్ రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి కాత్యాయిని దేవి, ఆర్థిక సంఘం అధికారులు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితి, సొంత ఆదాయ వనరుల పెంపు, ప్రజలకు అందిస్తున్న సేవల వ్యయాల అంచనా, పనితీరు సూచికల రూపకల్పన, నిధులు--విధులు--సిబ్బంది బదలాయింపు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ, ఆస్తుల నగదీకరణ, భౌగోళిక సమాచార వ్యవస్థ ఆధారిత మ్యాపింగ్ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

స్థానిక సంస్థలకు సమానత్వాధారిత వనరుల పంపిణీకి అనుసరించాల్సిన వ్యూహాలపై సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇచ్చారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు, వాటాదారుల సంప్రదింపులు, ప్రాంతీయ కార్యశాలలు, రాష్ట్రస్థాయి చర్చల ద్వారా ఆధారపూర్వక సిఫారసులను రూపొందించనున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల సంస్థాగత, ఆర్థిక సామర్థ్యాలను పెంపొందించేలా అధ్యయనాలు ఆచరణాత్మకంగా, అమలు చేయదగిన సిఫారసులను అందించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి స్థాయి, ఆర్థిక సామర్థ్యం, సేవల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిష్పాక్షిక సూచికల ఆధారంగా భవిష్యత్ వనరుల పంపిణీ విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు.

సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రాంతీయ అసమానతలు, జనాభా లక్షణాలు, సామాజిక--ఆర్థిక వెనుకబాటుతనం, మౌలిక సదుపాయాల లోపాలు, పర్యావరణ పరిస్థితులు, స్థానిక సంస్థల పాలన పనితీరును ప్రతిబింబించే సమగ్ర విశ్లేషణాత్మక చట్రం అవసరమని అభిప్రాయపడ్డారు. వనరుల పంపిణీ సమతుల్య, సమగ్ర అభివృద్ధితో పాటు స్థానిక పాలన సామర్థ్యం, ప్రజలకు అందే సేవల నాణ్యతను మెరుగుపరిచేలా ఉండాలని సూచించారు.డేటా ఆధారిత విశ్లేషణ, కొలవగల పనితీరు సూచికలు, పారదర్శక మూల్యాంకన విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సభ్య కార్యదర్శి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర చట్రాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులు, ఇతర వాటాదారులతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించి స్థానిక పరిస్థితులు, అభివృద్ధి అవసరాలను అధ్యయనాల్లో ప్రతిబింబించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధ్యయన రూపకల్పన, విధానాలు, సూచికలు, ఫలితాలను మరింత మెరుగుపరిచి సవరించిన ప్రతిపాదనను సమర్పించాలని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు రాష్ట్ర ఆర్థిక సంఘం సూచించింది.స్థానిక స్వపరిపాలన సంస్థలను బలోపేతం చేయడంతో పాటు సమానత్వం, పారదర్శకత, పనితీరు ఆధారిత వనరుల పంపిణీ వ్యవస్థ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఆర్థిక సంఘం స్పష్టం చేసింది.

ఇంటి నెంబర్ 4-15 వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తేవాలి

జవాన్ కుటుంబానికి అండగా సమాచార హక్కు పరిరక్షణ కమిటీ.
ఆర్.టి.ఐ దరఖాస్తు బదిలీ, ఇంటి నంబర్ కేటాయింపు, పంచాయతీ రికార్డులపై స్పష్టత ఇవ్వాలి.
ఖమ్మం, జనగాం, వరంగల్, జిల్లా అధ్యక్షుల మద్దతు.

ఆదాబ్ సైబరాబాద్, స్టేషన్‌ఘనపూర్ : స్టేషన్‌ఘనపూర్ మండల పరిధిలోని ఇంటి నెంబర్.4-15 ఇంటి నంబర్ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ స్టేషన్‌ఘనపూర్ మండల అధ్యక్షుడు మహ్మద్ సలీం డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయం కోసం పోరాడుతున్న జవాన్ కుటుంబానికి సమాచార హక్కు పరిరక్షణ కమిటీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇప్పటికే ఈ అంశానికి సంబంధించి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పలు కథనాలు వెలువడిన నేపథ్యంలో అధికారులు వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో వాస్తవ నిర్ధారణ విచారణ చేపట్టాలని కోరారు.ఇంటి నెంబర్ 4-15కు సంబంధించిన ఇంటి నంబర్ వ్యవహారంలో పలు సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయని మహ్మద్ సలీం పేర్కొన్నారు. అయితే ఎవరిపైనా ముందస్తుగా ఆరోపణలు చేయడం తమ ఉద్దేశం కాదని,అధికారిక రికార్డులు, పత్రాలు, సంబంధిత శాఖల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే వాస్తవాలు నిర్ధారణ అవుతాయని తెలిపారు. అందువల్ల సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విచారణ నిర్వహించి పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు.ఆర్ టి ఐ దరఖాస్తు బదిలీపై స్పష్టత ఇవ్వాలిఈ వ్యవహారంలో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరిన దరఖాస్తు కలెక్టర్ కార్యాలయానికి సమర్పించిన అనంతరం సంబంధిత అధికారికి బదిలీ చేసినట్లయితే,దాని వెనుక ఉన్న ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తును ఎవరి ఆదేశాల మేరకు బదిలీ చేశారు?,ఎందుకు బదిలీ చేశారు?,ఏ అధికారం లేదా నిబంధన ప్రకారం సంబంధిత అధికారికి బదిలీ చేశారు?,దరఖాస్తులో కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారికి పూర్తిగా అందించారా?,దరఖాస్తుదారుడికి కోరిన సమాచారాన్ని నిర్ణీత నిబంధనల ప్రకారం అందించారా?,అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం ఉద్దేశం ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమేనని,అందువల్ల దరఖాస్తుల విషయంలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఇంటి నంబర్ కేటాయింపుపై సమగ్ర పరిశీలనఇంటి నెంబర్ .4-15 ఇంటి నంబర్‌కు సంబంధించి గ్రామపంచాయతీ రికార్డుల్లో ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలని మహ్మద్ సలీం కోరారు.ఇంటి నంబర్ ఎప్పుడు కేటాయించారు?,ఎవరి దరఖాస్తు ఆధారంగా కేటాయించారు,సంబంధిత రిజిస్టర్లలో ఏ విధంగా నమోదు చేశారు?,ఇంటి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా?, హౌస్ ట్యాక్స్ ఎప్పుడు విధించారు? పన్ను చెల్లింపులకు సంబంధించిన రికార్డులు ఏమిటి?,తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని అన్నారు.అదేవిధంగా ఒకే ఇంటి లేదా స్థలానికి సంబంధించిన ఇంటి నంబర్లలో ఎప్పుడైనా మార్పులు,విభజనలు జరిగి ఉంటే వాటికి సంబంధించిన దరఖాస్తులు,పంచాయతీ తీర్మానాలు,అధికారుల అనుమతులు, రిజిస్టర్లలో నమోదైన వివరాలను పరిశీలించాలని కోరారు. కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన వివాదాల కారణంగా ఇంటి నంబర్ మార్చడం లేదా విభజించడం కోసం ఎవరైనా సంతకాలు చేసి ఉంటే,,ఆ సంతకాలు ఏ సందర్భంలో తీసుకున్నారు?,ఎవరి సమక్షంలో తీసుకున్నారు,వాటికి సంబంధించిన అధికారిక రికార్డులు ఏమిటి? అనే అంశాలను కూడా విచారణలో భాగంగా పరిశీలించాలని అన్నారు.
గ్రామపంచాయతీ రికార్డులు బయటపెట్టాలి
ఇంటి నెంబర్ 4-15కు సంబంధించిన పాత, ప్రస్తుత గ్రామపంచాయతీ రికార్డులను అధికారులు పరిశీలించాలని మహ్మద్ సలీం తెలిపారు.ఇంటి నంబర్ కేటాయింపు రిజిస్టర్, హౌస్ ట్యాక్స్ రిజిస్టర్,నిర్మాణ అనుమతులు,పంచాయతీ తీర్మానాలు,పన్ను చెల్లింపు రసీదులు,సంబంధిత దరఖాస్తులు, అధికారుల ఉత్తర్వులు తదితర పత్రాలను ఒకచోట చేర్చి పరిశీలిస్తేనే అసలు విషయం బయటపడుతుందని అన్నారు.రికార్డుల్లో ఉన్న వివరాలు,ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను సరిపోల్చి చూడాల్సిన అవసరం ఉందన్నారు.రికార్డుల్లో ఏమైనా మార్పులు జరిగి ఉంటే అవి ఎప్పుడు,ఎవరి ద్వారా,ఏ కారణంతో జరిగాయనే అంశాన్ని కూడా నిర్ధారించాలని కోరారు.పోలీసు కేసులు,ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణఈ వ్యవహారానికి సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, ఫిర్యాదులు,విచారణ వివరాలు,సంబంధిత పత్రాలు తదితర అంశాలను కూడా పోలీసులు నిష్పక్షపాతంగా పరిశీలించాలని మహ్మద్ సలీం కోరారు.ఈ వ్యవహారంలో ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పించారా?,సమర్పించి ఉంటే వాటి ఆధారంగా ఏమైనా చర్యలు తీసుకున్నారా?,అనే అంశాలను విచారణ ద్వారా తేల్చాలని అన్నారు.అలాగే ఈ వ్యవహారంలో పెద్దమనుషుల పాత్ర, రాజకీయ నాయకుల జోక్యం లేదా ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా లేదా అనే విషయాన్ని కూడా ఆధారాలతోనే నిర్ధారించాలని కోరారు. ఎవరిపైనా ముందుగానే ఆరోపణలు చేయకుండా,అందుబాటులో ఉన్న రికార్డులు, పత్రాలు,సాక్ష్యాల ఆధారంగా విచారణ జరపాలని స్పష్టం చేశారు.'ఎవ్వరినీ నిందించడం మా ఉద్దేశం కాదు'"ప్రస్తుతం ఎవ్వరినీ నిందించడం మా ఉద్దేశం కాదు. ఎవరు తప్పు చేశారు,ఎవరు చేయలేదు అనే విషయం అధికారిక రికార్డులు,పత్రాలు,ఆధారాలు బయటకు వచ్చిన తర్వాతే తేలుతుంది. అందువల్ల వాస్తవాలను దాచకుండా పూర్తి స్థాయి విచారణ జరిపించాలి.అధికారుల ప్రత్యక్ష తనిఖీతోపాటు అన్ని శాఖల రికార్డులను పరిశీలిస్తేనే అసలు నిజం ప్రజల ముందుకు వస్తుంది" అని మహ్మద్ సలీం అన్నారు. సీపీ , ఎంపీడీఓ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి ఫిర్యాదులు ఇంటి నెంబర్ 4-15 వ్యవహారంపై ఇప్పటికే పోలీసు కమిషనర్ (సీపీ)కు దరఖాస్తు, ఎంపీడీఓ కు గ్రీవెన్స్/ఫిర్యాదు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి సంబంధిత నాలుగు శాఖల పరిధిలోని అంశాలపై దరఖాస్తులు సమర్పించినట్లు మహ్మద్ సలీం తెలిపారు.ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు స్పందించి నిబంధనల ప్రకారం విచారణ చేపట్టాలని కోరారు.కేవలం ఒక శాఖ రికార్డులను పరిశీలించడం ద్వారా ఈ వ్యవహారం పూర్తిగా తేలదని,గ్రామపంచాయతీ, రెవెన్యూ, పోలీసు,సంబంధిత ఇతర శాఖల రికార్డులను సమన్వయంతో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.అన్ని శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని ఒకచోట చేర్చి సమగ్రంగా పరిశీలించినప్పుడే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.గ్రామంలో ప్రత్యక్ష తనిఖీ నిర్వహించాలి అధికారులు గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష తనిఖీ నిర్వహించాలని మహ్మద్ సలీం డిమాండ్ చేశారు.ఇంటి నెంబర్ 4-15కు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని పరిశీలించడంతో పాటు పాత రికార్డులు, ఇంటి నంబర్ కేటాయింపు వివరాలు,పన్ను రికార్డులు,నిర్మాణ అనుమతులు, పంచాయతీ తీర్మానాలు,ఫిర్యాదులు,పోలీసు రికార్డులు తదితర అన్ని అంశాలను పరిశీలించాలని కోరారు.విచారణ సందర్భంగా సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేసి, పత్రాల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలని అన్నారు. విచారణ అనంతరం అధికారులు ఇచ్చే నివేదికను కూడా పారదర్శకంగా ఉంచాలని కోరారు.జవాన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం జవాన్ కుటుంబానికి అన్యాయం జరిగి ఉంటే న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య, చట్టబద్ధ మార్గంలో అండగా ఉంటామని మహ్మద్ సలీం తెలిపారు.అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కూడా ముందస్తు నిర్ణయానికి రాకుండా,విచారణలో వాస్తవాలు తేలిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు."జవాన్ కుటుంబానికి న్యాయం చేయడం,అధికారిక రికార్డుల్లో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం మా ప్రధాన లక్ష్యం. ఎవరి హక్కులకు భంగం కలగకుండా,ఎవరిపైనా అన్యాయమైన ఆరోపణలు చేయకుండా చట్టపరమైన మార్గంలోనే ముందుకు వెళ్తాం"అని ఆయన పేర్కొన్నారు.జిల్లా అధ్యక్షుల మద్దతు ఈ న్యాయపోరాటానికి సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జనగాం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జావిద్ ఖాన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు మద్దతు ప్రకటించారు.ఇంటి నెంబర్ 4-15 వ్యవహారంపై అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ నిర్వహించి, అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులు, పత్రాలు,ఆధారాల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు.జవాన్ కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని,ఒకవేళ విచారణలో ఎవరి తప్పిదమైనా నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని,అదే సమయంలో ఆరోపణలు వాస్తవం కాకపోతే ఆ విషయాన్ని కూడా అధికారికంగా స్పష్టం చేయాలని మహ్మద్ సలీంమండల అధ్యక్షుడు
సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ
స్టేషన్ ఘనపూర్ వారు కోరారు.

2028 సంవత్సరములో జరగబోయే మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర భక్తుల కోసం

మేడారం భక్తుల కోసం స్నాన ఘట్టాలు
21 కోట్ల 25 లక్షలు రూపాయలు ప్రతిపాదించిన ఇరిగేషన్ డిపార్ట్మెంట్
ఊరట్టం కాజువే నుండి చిలకల గుట్ట వరకు

ఆదాబ్ సైబరాబాద్, ములుగు,2028 సంవత్సరంలో జరగబోయే మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర భక్తుల కోసం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ భారీ స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది 21 కోట్ల 25 లక్షల రూపాయలతో జంపన్న వాగుకు ఊరట్టం సైడ్ ఊరట్టం కాజువే నుండి చిలకల గుట్ట వరకు 900 మీటర్లు స్నాన గట్టాలు (మెట్లు) కోసం ఇటీవలే ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సర్వే చేసి ప్రభుత్వంకు నివేదిక పంపారు. ఊరట్టం ప్రాంతంలో పార్కింగ్ చేసిన భక్తులకు సౌకర్యం ఏర్పాటుతో పాటుగా ఊరట్టం రైతులకు వరదల సమయంలో వాగు భూమి కోతకు గురి కాకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు అవుతుంది

జోహార్లు అర్పిస్తున్నాను ఆదివాసి గుండెల్లో జ్యోతులు వెలిగించిన నేతకు జోహార్లు అర్పిస్తున్నాను

ఆదాబ్ సైబరాబాద్, ములుగు :
ఆదివాసీ గుండెల్లో జ్యోతులు వెలిగించిన నేతకు
స్వయపాలన స్వావలంబనకు నెత్తుటి విత్తులు
నాటిన నేతకు
జోహార్లు అర్పిస్తున్నాను
అడవితల్లి పురిటి నొప్పులను
గూడెం బిడ్డల చావు కేకలను
ఆకలితో ఎండిన డొక్కల
బక్కపల్చని గూడెం జీవుల
కష్టాలను చూసినువ్వు
బంధుక్ ఎక్కుబెట్టి
బ్రతుకు బాట చూపినోడా!
రాంజీ గోండు బాటలోన
రణం జేయ ఉరికినోడా!
జోహార్లు అర్పిస్తున్నాను
నీటికోసం అడవి కోసం పుట్టిపెరిగిన నేలకోసం
పటేల్ పట్వారి దొరలను
పరుగులు పెట్టించినోడా
జంగ్లాత్ అమీను సాబును
అడ్డగించి ఎదురించినోడా!
గూడెం గుండెకు నువ్వే తుడుం మోతల
చప్పుడైతివి
జోహార్లు అర్పిస్తున్నాను
రజాకార్ మూకలకు
కంటిలో నలుసైనవ్
కాలిలో ముల్లయినవ్
గుండెల్లో గుబులైనవ్
సంకెనపల్లికి అండయినవ్
అన్నీ గుడాలకు తోడైనవ్
ఆదివాసిల నేటి హక్కులకు
నీరుదిరం దారైంది!
ఓ వీరుడా జోహార్లు
అర్పిస్తున్నాను
గూడెంలోనా అడవిలోన
అడవి బ్రతుకులు చిదిమి పోతే!
శావుకార్ల రజాకార్ల వెట్టి హింసల కళ్ళజూచి
ఉడుకునెత్తిరు ఉప్పనై
రజాకార్ సిద్దీకినీ ఉరికించి చంపినావు
అడవి జీవుల బ్రతుకులల్లో
కొత్త ఆశలు రేపినావు
ఓ వీరుడా
జోహార్లు అర్పిస్తున్నాను
చాయ్ పత్తాదేశంపోయి
అక్షరాలు నేర్చుకోనీ
విప్లవాలా గుర్తువై
మళ్ళీ గూడెం కొస్తివా
మార్పుకోసం నిజాం చుట్టూ తిరిగి అలిసి
పోతివా
జల్ జంగిల్ జమీన్ అంటూ
జంగ్ సైరాన్ వేస్తివా
తుడుం మోతల చప్పుడులో ఇప్పటికి
మోగుతుంటివా!
జోహార్లు అర్పిస్తున్నాను
బల్లెం బాణం అందుకొని
భరీషే గొడ్డలి ఎత్తుకొని
కొడవలి కత్తి పట్టుకొని
కత్తుల వంతెన దాటుకొని
అడివిల ఉరుమై
కంటిలో మెరుపై
జోడెన్ గాడ్ చేరుకొని
నిజాం ముష్కర దౌర్జన్యానికి
సవాల్ విసిరిన సారధికి
జోహార్లు అర్పిస్తున్నాను
నీ రణం ఒక స్థైర్యం
నీ ధైర్యం ఒక మార్గం
నీ పోరాటం ఒక దిక్సూచి
నీ మరణం ఒక విప్లవం
నీ త్యాగం ముందు తరాల భవిష్యత్తు
నీవేత్తిన రగల్ జెండా
ప్రపంచానికి కొత్త పరిచయం
రచన :
కల్తీ. క్రిష్ణమూర్తి
AHS. రాయినిగూడెం
సెల్. నెం :9494036818

ఖమ్మం ఎం.పీ పై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జ్ సిగ్గుచేటు

రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకోవడాన్ని అడ్డుకున్న ఎం.పీ లపై అమిత్ షా గుండాల చర్యలను ఖండిద్దాం.
అమిత్ షా రాజీనామా చేయాలి.
కరాటే వేణు.

ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం : ఢిల్లీలో కొనసాగుతున్న ప్రతిపక్షాల నిరసనల సందర్భంగా ఖమ్మం ఎం.పీ రామసహాయం రఘురాంరెడ్డి పై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేసిన ఘటనపై ఖమ్మం జిల్లా చెందిన కరాటే వేణు తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ, ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలో బ్రిటీష్ కౌన్సిల్ సమీపంలో పోలీసులు చేసిన లాఠీచార్జ్ లో రఘురాంరెడ్డి కి లాఠీ దెబ్బలు తగిలిన నేపథ్యంలో ప్రజల చేత ఎన్నుకున్న నాయకులపై ఢిల్లీ పోలీసులు ప్రవర్తించిన తీరుపై కరాటే వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులపై పోలీసుల బలప్రయోగం ఆందోళన కలిగించే పరిణామమని, ప్రతిపక్ష నాయకులపై పోలీసు చర్యలకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కరాటే వేణు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనలను అణచివేయకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించకుంటే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని ఆ హక్కును ప్రసాదించిన రాజ్యాంగాన్ని సైతం హేళన చేస్తున్నటు వంటి నాటి అమిషా లాంటి నాయకులు సైతం తెలుసుకోవాలని లాఠీ చార్జులు అనేవి ఈ దేశంలో పుట్టిన వాళ్లకి కొత్తేమీ కాదు కానీ అవి ఒకప్పుడు బ్రిటిష్ పాలన కాలంలోనే అంతమైపోయాయి వాటిని మళ్లీ రెచ్చగొట్టే ఉద్దేశంతో ఇలాంటి దుస్సాహసాలను ఇంకొకసారి చేయకూడదని ప్రభుత్వము ప్రతి ఒక్కరికి అండగా ఉండాలని ప్రజల సమస్యలను పరిష్కరించడం కానీ మంత్రులను గౌరవించడంలో కానీ వాళ్ల వంతు కృషి ఎల్లప్పుడూ ఉండాలి అలాంటిది ఈనాటి నాటి లాఠీచార్జ్ అనేది చాలా దయనీయకర పరిస్థితి ప్రజలకు ప్రభుత్వం పట్ల బాధ్యత నమ్మకం అనేవి కోల్పోయే స్థితిని వారు కలుగజేసుకుంటున్నారని ఇప్పటికైనా మారాలని సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

తెలంగాణ ఓటర్ల జాబితా: 71.23 లక్షల మందిని చేర్చేందుకు ఆమోదం

హైదరాబాద్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై విచారణ పూర్తి నవంబర్ 5లోగా అభ్యంతరాల పరిష్కారం, నవంబర్ 9న తుది జాబితా ప్రచురణ ఒకే ఇంట్లో 15 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయాలని బీజేపీ డిమాండ్ తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా, తుది జాబితాలో చేర్చేందుకు 71.23 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 7వ తేదీ నాటికి నోటీసులపై విచారణ పూర్తి చేసి, వీరి పేర్లు చేర్చేందుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు.ఓటర్ల జాబితాలోని రికార్డులలో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక కారణాల రీత్యా మొత్తం 92.88 లక్షల నోటీసులు జారీ చేయగా, అందులో 91.92 లక్షల నోటీసులను ఓటర్లకు అందజేశారు.

అక్టోబర్ 7వ తేదీతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. ఈ అభ్యంతరాలను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించి, నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఆగస్టు 17న ఎన్నికల సంఘం ఇంటింటి సర్వే అనంతరం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73.39 లక్షల మందిని మరణించిన, చిరునామా మారిన లేదా నకిలీ ఓటర్లుగా గుర్తించారు. సుమారు 57.46 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మార్చుకోగా, 9.22 లక్షల మంది మరణించినట్లు, మరో 6.70 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు వెల్లడైంది.ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒకే ఇంటి నంబర్‌పై 15 లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పునఃపరిశీలన (రీ-వెరిఫికేషన్) చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని బీజేపీ కోరింది. తమ డేటా విశ్లేషణలో ఇలాంటి ఓట్లు సుమారు 1.63 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించామని, వీటిని బూత్ స్థాయి అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

నానా పటేకర్ మృతి భారతీయ సినిమాకు తీరని లోటు: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8: ప్రముఖ నటుడు నానా పటేకర్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో నానా పటేకర్ మరణం తీరని లోటని పేర్కొన్నారు. హిందీ, మరాఠీ చిత్ర పరిశ్రమల్లో తనదైన శైలిలో నటిస్తూ ఆయన చెరగని ముద్ర వేశారని సీఎం కొనియాడారు.అద్భుతమైన నటన, సహజమైన అభినయంతో నానా పటేకర్ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక

స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. విభిన్న పాత్రలకు, తన నటనా ప్రతిభతో ప్రాణం పోసిన ఆయన.. భారతీయ సినిమా రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నో దశాబ్దాల పాటు తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించిన నానా పటేకర్ ఇక లేరనే వార్త సినీ అభిమానులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని అన్నారు.నానా పటేకర్ మృతి నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులకు సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. నానా పటేకర్ పోషించిన పాత్రలు, ఆయన సహజమైన నటనా శైలి, సినీ రంగానికి చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని సీఎం పేర్కొన్నారు. భారతీయ సినిమా చరిత్రలో ఒక విశిష్ట నటుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. నానా పటేకర్ ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రార్థించారు.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు.. పలు ప్రాంతాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..!

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండల మంటలు, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా.. భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావంవల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని వాతావరణ అధికారులు చెప్పారు. రుతుపవనాల తిరోగమనం ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం

హైదరాబాద్ : తన ఫొటోను మార్ఫ్ చేశారంటూ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌పై సజ్జనార్ అసంతృప్తి సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటో ఏఐ సృష్టించిన ఫేక్ అని స్పష్టీకరణ ఈ విషయాన్ని గమనించాలంటూ నటుడు ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేసిన వైనం నిజనిజాలు తెలుసుకోకుండా కంటెంట్‌ను ఫార్వర్డ్ చేయవద్దని నెటిజన్లకు విజ్ఞప్తిచట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికజూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం.ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది.

ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు.వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని,ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు.వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు.ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

హైదరాబాద్‌లో ఇండీ కూటమి 'చలో లోక్‌భవన్' ఉద్రిక్తం

హైదరాబాద్: హైదరాబాద్‌లో 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ ఉద్రిక్తంగా మారి ంది. నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్య క్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, వామపక్ష పార్టీ నేతలు ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. రాజీనామా చేయాలని డిమాండ్‌దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.ఇండీ కూటమి ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకునే సరికి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో పోలీసులకు, ఇండీ కూటమి నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి

లోక్ భవన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మంత్రులను అదుపులోకి తీసుకుని డీసీఎంలోకి ఎక్కించి పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు."దేశవ్యాప్తంగా ఓటు హక్కును కాపాడుకోవడానికి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రాహుల్ గాంధీ చేస్తున్న నిరసనకు మాతో పాటు దేశంలోని ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. వెంటనే బీజేపీ స్పందించి ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్?తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేస్తున్నాం"- తెలంగాణ మంత్రులుమంత్రుల అరెస్ట్‌తో లోక్‌భవన్ ప్రాంగణం మరింత ఉద్రిక్తంగా మారింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, ప్రశ్నించే గొంతులను పోలీసులతో నొక్కేయాలని చూస్తోందని అరెస్ట్? అయిన నాయకులు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి సీతక్క ఇలాకాలో ఇసుక లారీ బీభత్సం.. సీఆర్పీఎఫ్ డీసీఎంను ఢీకొట్టి ఆపై.

ములుగు : మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఇసుక అక్రమ ఇసుక తవ్వకాల వ్యవహారం ఇప్పటికే తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. అక్రమ ఇసుక మాఫియాకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన యువకులపై పోలీసులు గతంలో కేసులు కూడా నమోదు చేశారు. ములుగు ఇసుక మాఫియా బీభత్సం సృష్టిస్తోంది.హై స్పీడ్‌లో ఉన్న ఓ ఇసుక లారీ ములుగు జిల్లా పస్రా తాడ్వాయి మధ్య అటవీ శాఖ చెక్‌పోస్ట్ సమీపంలో రెండు వాహనాలను ఢీకొ ట్టింది. ఇసుక లారీ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టి.. ఆగకుండా వెళ్లి రెవెన్యూ శాఖకు చెందిన కారును కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. మరో ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

ఏసీబీ వలకు చిక్కిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి.. రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత

ఖానాపూర్ (నిర్మల్) : నిర్మల్ జిల్లా ఖానాపూర్ రేంజ్ అటవిశాఖాది ,కారి లంచం తీసుకుంటూ ఏసీబీఅధికా రులకు పట్టుబడ్డారు. టింబర్ డిపో లైసెన్స్ రెన్యూవల్‌తో పాటు డిపో పై ఎలాంటి నివేదికను ఉన్నతా ధికారులకు అందజేయ కుండా ఉండేందుకు సెక్షన్ అధికారి అయిండ్ల రవీందర్‌ను డిపో యజమాని సంప్రదించాడు.దీంతో లంచం డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులను

సంప్రదించాడు. గురువారం సెక్షన్ అధికారి రూ. 12 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

తెలంగాణలో స్థానికత అంశం - మరోసారి స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు

హైదరాబాద్ : తెలంగాణ స్థానికత విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరో సారి స్పష్టత ఇచ్చింది. తెలంగాణలో స్థానిక రిజ ర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరిగా ఉం డాలని పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిందేనని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ బెంచ్ ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తెలం గాణ స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యా భ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటి షన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న పిటిషనర్? వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసి ంది. ఎంబీబీఎస్ అర్హత పరీక్ష(నీట్)కు ముందు వరుసగా నాలుగేళ్ళ తెలంగాణలో చదువుకుం టేనే స్థానికత వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం

చేసింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను మరోసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.అసలు కథ మొదలైంది ఇక్కడ : వైద్య విద్యలో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు స్వరాష్ట్రం తెలంగాణలో చదివి ఉండాలని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులను జారీ చేసింది. అప్పుడే కొంతమంది విద్యార్థులు ఈ అంశంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్? దాఖలు చేయగా, నిబంధనలను తప్పుబడుతూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.దీనిపై తెలంగాణ ప్రభుత్వం నేరుగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటిషన్? దాఖలు చేసింది. ఈ కేసు విచారణను చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌ల ధర్మాసనం అన్ని అంశాలను పరిగణించి కొద్ది రోజుల పాటు తీర్పును రిజర్వ్ చేసింది. ఆగస్టు 05న వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు తెలిపిన న్యాయస్థానం, ఇంకేమైనా వాదనలుంటే ఆగస్టు 8లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఇరు వర్గాలను ఆదేశించింది.ప్రభుత్వంపై సీజేఐ ఆగ్రహం : స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని జస్టిస్ గవాయ్ విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు ధర్మాసనంతో చెప్పారు.